నవతెలంగాణ
నమ్మిక తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | నవంబర్ 12, 2024 | www.navatelangana.com

గంజాయి పట్టివేత

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని హమాలివాడలో 115 గ్రాముల గంజాయిని ఆబ్కారీ శాఖ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. దాడిలో ఎస్ఐ శంకర్, వెంకటరమణ, సిబ్బంది ప్రసాద్, మహేష్, ఉమారాణి పాల్గొన్నారు.



కలెక్టర్ ఆశ్రమోన్నత పాఠశాల తనిఖీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని వాన్‌వట్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూం, మధ్యాహ్నం భోజనం పరిశీలించి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను సబ్జెక్టుల వారీగా అడిగి తెలుసుకున్నారు. వార్డెన్‌ను విద్యార్థులకు సంబంధించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో సంభాషిస్తూ ఏ సబ్జెక్ట్ టఫ్‌గా ఉందని అడిగారు. బాగా చదువుకోవాలని, అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయులు సీవీ రావు, వార్డెన్, ఉపాధ్యాయులు ఉన్నారు.



గాండ్రిస్తున్న బెబ్బులి..!

- ఉమ్మడి జిల్లాలో పులులు, చిరుతల సంచారం
- మహారాష్ట్ర నుంచి రాక..పశువులపై దాడి
- భయభ్రాంతులకు గురవుతున్న పరిసర గ్రామాల జనం
- రక్షణ చర్యలు ప్రారంభించిన అటవీశాఖ అధికారులు

ప్రతి ఏటా చలికాలం రాగానే ఉమ్మడి జిల్లా వణికిపోతుంటుంది. జిల్లావాసులు చలిని పులితో పోల్చుతూ..చలి పులిలా భయపెడుతుందని అంటుంటారు. ఇన్నాండ్లు ఇది కేవలం మాట వరుసకే అంటుండగా.. ఇప్పుడు స్వయంగా పులి భయపెడుతుండటం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడూలేని విధంగా ఉమ్మడి జిల్లాలో పులులు, చిరుతల సంచారం అధికమైంది. అప్పుడప్పుడు చుట్టపుచూపుగా వచ్చిపోతుండగా.. ప్రస్తుతం కొన్ని రోజుల పాటు ఇక్కడే మకాం వేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా నిర్మల్ జిల్లా సమీపంలోని మహబూబాఘాట్ వద్ద పులి రోడ్డు దాటుతూ వాహనదారుల కంట పడటం కలకలం రేపుతోంది. ఇన్నాండ్లు చిరుతలు సంచరిస్తు పలు చోట్ల పశువులను చంపి తింటుండగా.. తాజాగా పెద్దపులులు సైతం పశువులపై దాడి చేస్తూ ఉమ్మడి జిల్లాలో సంచరిస్తున్నాయి. పులులు, చిరుతల సంచారంతో ఉమ్మడి జిల్లావాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మరోవైపు అటవీశాఖ అధికారులు పులులు, చిరుతల సంరక్షణ కోసం చర్యలు ప్రారంభించారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అడవుల జిల్లాగా పేర్కొనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులులు, చిరుతల సంచారంతో జనం ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా దట్టమైన అభయారణ్యం విస్తరించి ఉండటంతో వాటికి కలిసివస్తోంది. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కవ్వాల్ వంటి పులుల సంరక్షణ కేంద్రం ఉన్నప్పటికీ.. ఇన్నాండ్లు పులి జాడ లేకుండా పోయింది. గతంలో దట్టమైన అడవి కారణంగా ఇక్కడ పులుల సంచారం అధికంగా ఉండేదని చెబుతుండేవారు. ఇక్కడి అడవిలో చిరుతల సంచారం ఉన్నప్పటికీ.. కొన్నేండ్ల నుంచి పులుల జాడ లేకుండాపోయింది. కానీ తాజాగా మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అడవుల నుంచి వస్తుండటంతో ఇక్కడా బెబ్బులి గాండ్రింపులు వినిపిస్తున్నాయి.

కనిపించిన పశువులపై పంజా విసురుతున్నాయి. రెండు నెలల క్రితం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో పులి అడుగు జాడలు గుర్తించగా.. తాజాగా ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో పులులు సంచరిస్తున్నట్లు ప్రజలతో పాటు అటవీ అధికారులు గుర్తించారు. ఇటీవల బోథ్ మండల అటవీ ప్రాంతంలో సంచరించిన పులి నిర్మల్ జిల్లా సారంగపూర్, సూర్యాపూర్, రవీందర్‌నగర్, అడెల్లి ప్రాంతాల్లో సంచరించి వెళ్లిపోయింది. మహారాష్ట్ర సరిహద్దుకు వెళ్లిన ఆ పులి తాజాగా కుంటాల మండలం అంబుగాంతో పాటు పలు గ్రామాల శివారు గుండా నర్సాపూర్ మండలం తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు అధికారులు గుర్తించారు.

తిప్పేశ్వర్ నుంచి రాక..!

మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అడవులు ఉమ్మడి జిల్లా సరిహద్దులకు ఆనుకొని ఉంటాయి. ప్రతి ఏటా ఈ అడవులతో పాటు తాడోబా అభయారణ్యం నుంచి ఇక్కడకు వచ్చిపోతుంటాయి. సరిహద్దు ప్రాంతాల గుండా జిల్లాలోకి ప్రవేశించి ఇక్కడి పశువులను వేటాడి కొన్ని రోజుల పాటు మకాం వేస్తుంటాయి. తిరిగి వాటి ఆవాసాల వైపు వెళ్లిపోతుంటాయి. కొన్నేండ్ల నుంచి ఇది సహజమైన ప్రక్రియగా కొనసాగుతోంది. తాజాగా కొన్ని రోజుల నుంచి ఉమ్మడి జిల్లాలో పెద్దపులి సంచారం జనాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. వారం రోజుల క్రితం తిప్పేశ్వర్ నుంచి వచ్చిన పులి మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మండలంలో మూడు ఆవులను, హాజీపూర్ మండలంలో రెండు గొర్రెలను చంపేసింది. ప్రస్తుతం మంచిర్యాల సమీపంలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక చిరుతల సంచారం సైతం అధికమైంది. సారంగపూర్ మండలంలో రెండు ఎద్దులతో పాటు ఒక ఆవుపై దాడి చేసి చంపడంతో స్థానికంగా భయాందోళన వ్యక్తమైంది. తాజాగా ఆదివారం రాత్రి మహబూబ్‌ఘాట్ వద్ద రోడ్డు దాటిన పులి మామడ మండలం రాసిమెట్ల అడవుల్లోకి వెళ్లినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు.

జనంలో భయాందోళన..!

ఉమ్మడి జిల్లాలో అధిక భాగం పంట పొలాలు అటవీ ప్రాంతాలకు ఆనుకొని ఉండటం..పులులు, చిరుతల సంచారం అధికం కావడంతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పత్తి పంట ఏరడం, వరికోతలు ప్రారంభం కావడంతో పాటు రబీ సీజన్ కూడా మొదలైంది. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. అనేక మంది రైతుల పొలాలు అటవీ ప్రాంతాలకు అతి సమీపంలో ఉండటం..పులులు, చిరుతల సంచారం అధికం కావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ మండలాలు, గ్రామాల పరిధిలో సంచరిస్తుండటం కారణంగా పొలం పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. మరోపక్క పులులు, చిరుతలను సంరక్షించేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. సమీప గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటికి ప్రాణహాని కలగకుండా విద్యుత్తు కంచెలను తొలగిస్తున్నారు. మరోపక్క అప్రమత్తంగా ఉండాలంటూ జనాలకు సైతం సూచనలు చేస్తున్నారు.





సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తాం



నవతెలంగాణ-నస్పూర్

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని వీఓఏల సంఘం(సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట 48 గంటల ధర్నా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకేపీ వీఓఏ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుంటాల కుమార్, దుర్గం రాములుతో కలిసి డీఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం గ్రామ సంఘం నుండి రావల్సిన రూ.3వేలు అమలు కావడం లేదన్నారు. సెర్ప్ నుండి రూ.5వేలు, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల నుండి రూ.3వేలు తీసుకోవాలని నిర్ణయించారని, కానీ గ్రామ సంఘాలకు ఆదాయం లేక అమలు కావడం లేదని తెలిపారు. విఓఏలు ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే గ్రామ సమైక్యల నుండి రావాల్సిన రూ.3వేల వేతనాన్ని విఓఏలకు ఇవ్వాలని, స్త్రీనిధి ఇన్సెంటివ్ 2సంవత్సరాల నుండి రావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీఓఏలక ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, అనారోగ్యం, ప్రమాదాల్లో మరణిస్తే బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం విఓఏలకు రూ.20వేల వేతనం ఇవ్వాలని, ప్రతినెలా రెగ్యులర్ వేతనాలు వ్యక్తిగత ఖాతాల ద్వారా ఇవ్వాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు చెల్లించాలని, పెండింగ్ ఇన్సెంటివ్ గ్రామ సంఘాలకు ఇవ్వాలని, అర్హులైన విఓఏలకు సిసిలుగా ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పొట్ట పోశం, జిల్లా కమిటీ సభ్యులు రజిత, అనిత, శారద, మహేష్, వెంకటి, సమ్మన్న, తుకారాం, రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, అనూష, లక్ష్మణ్, సురేష్, రమాదేవి పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ పరిధిలోని పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆశన్న, కిరణ్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని, ప్రతి నెల 5వ తేదీలోగా వేసేలా చూడాలని డిమాండ్ చేశారు. ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

మంచిర్యాల : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి మున్సిపల్ పరిధిలోని 5, 27 వార్డులలో సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో భాగంగా ఇండ్ల జాబితా ప్రక్రియ పూర్తయిందని, ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యుల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లో పూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నిర్దేశిత నమూనాలో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని, ఇంటి యజమానులు అవసరమైన పత్రాలతో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

నిర్మల్ : పత్తి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పత్తి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్‌కుమార్‌తో కలిసి ఆమె వ్యవసాయ మార్కెటింగ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పత్తి పంటను అమ్మిన వెంటనే నిర్దేశించిన సమయంలోపు రైతుల ఖాతాలలో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి తేమ శాతంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పించి అధిక లాభాలు పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోజువారీగా సేకరించిన పత్తికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పత్తి పంటను విక్రయించడానికి వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మార్కెట్ యార్డులలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, మార్కెటింగ్ కార్యదర్శులు అజాం అలీ, దుండానాయక్, పుద్యా నాయక్, గంగన్న, చంద్రశేఖర్ నాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

దండేపల్లి : మండలంలోని తాళ్లపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాలీ బాల్ జోనల్ స్థాయి పోటీలు సోమవారం ముగిసాయి. పోటీలో గెలుపొందిన జట్లకు నిర్వాకులు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానంలో ఆదిలాబాద్ జట్టు, రెండవ స్థానంలో మంచిర్యాల జట్టు అద్భుతంగా రాణించి పోటీల్లో ఆసక్తి రేకెత్తించాయి. రాష్ట్ర స్థాయికి ఎంపికైన సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్, ఎస్జిఎఫ్ కన్వీనర్ పని రాజా, మాజీ ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, టోర్నమెంట్ కన్వీనర్ సుదర్శన్, స్థానిక నాయకులు లచ్చు పటేల్, దయాకర్, రవి, ఇమ్రాన్‌ఖాన్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో విషాదం

- హాస్టల్ గదిలో ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-ముథోల్

బాసర ట్రిపుల్ ఐటీలో పియుసి-2 చదువుతున్న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని స్వాతిప్రియ సోమవారం ఉదయం హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వ్యక్తిగత కారణాలతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని ట్రిపుల్ ఐటీ అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థినికి సోమవారం ఉదయమే పరీక్షలు ఉండగా అదే రోజే ఆత్మహత్యకు పాల్పడటం పలు అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థిని మృతితో ట్రిపుల్ ఐటీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆత్మహత్య విషయం విద్యార్థిని కుటుంబసభ్యులకు అధికారులు సమాచారాన్ని చేరవేశారు. కుటుంబ సభ్యులు వచ్చే లోపు మృతదేహాన్ని బైంసా ఆసుపత్రికి తరలించారు. తమ బిడ్డ ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని విద్యార్థిని తల్లిదండ్రులు రవీందర్-ఉజ్వల రోదిస్తూ తెలిపారు. తాము ట్రిపుల్ ఐటీకి వచ్చేలోపు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించడం ఎంతవరకు సబబు అని వారు ప్రశ్నించారు. హాస్టల్ రూమ్‌లో గదిని శుభ్రం చేశారని ఆరోపించారు. ట్రిపుల్ ఐటీ అధికారులు తమ బిడ్డను బలి తీసుకున్నారని వారు ఆరోపించారు. పియుసి-3 చదువుతున్న అబ్బాయి, పియుసి-2 చదువుతున్న అమ్మాయి గొడవలో తమ బిడ్డను బెదిరించడంతో ట్రిపుల్ ఐటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు తమ కూతురు ఇటీవలే ఫిర్యాదు చేసిందన్నారు. అధికారులు స్పందించకపోవడంతోనే ఈ ఘోరం జరిగిందని వారు కన్నీటి పర్యంతమయ్యారు. కూతురు ఆత్మహత్య కారణమైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



రోదిస్తున్న తల్లిదండ్రులు



స్వాతిప్రియ మృతదేహం

ట్రిపుల్ ఐటీ ముట్టడి

విద్యార్థిని ఆత్మహత్యను నిరసిస్తూ ఏబీవీపీ నాయకులు ట్రిపుల్ ఐటీ ముట్టడికి యత్నించారు. సెక్యూరిటీ సిబ్బంది ఆందోళనకారులపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. దీంతో ఓ విద్యార్థి నాయకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆగ్రహించిన నాయకులు ట్రిపుల్ ఐటీ ఎదుట బైటాయించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ట్రిపుల్ ఐటీ సీఐ రాకేష్ వాహనాన్ని అడ్డుకున్నారు. సెక్యూరిటీతో కొట్టించడం ఎంతవరకు సబబు అని ఏబీవీపీ నాయకులు ప్రశ్నించారు. విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీ భద్రతను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్ విద్యార్థిని ఆత్మహత్య నేపథ్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థి సంఘ నాయకులు ముట్టడించడంతో ఆలస్యంగా చేరుకున్న పోలీసులు వెంటనే చుట్టుపక్కల మండలాల నుండి ఎస్ఐలను, పోలీస్ సిబ్బందిని రప్పించారు. గేటు ముందు ప్రత్యేక బలగాలను భద్రత కోసం ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను ఏఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ సిబ్బంది తమపై దాడి చేశారని ఏబీవీపీ నాయకులు ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్
- గురుకుల జోనల్ స్థాయి క్రీడలు ప్రారంభం



నవతెలంగాణ-ముథోల్

విద్యార్థులు క్రీడలో రాణించాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం ముథోల్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో బాలుర విభాగంలో పదవ జోనల్ స్థాయి క్రీడలను ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లాలోని ప్రముఖ పాఠశాలగా పేరు ప్రఖ్యాతులు పొందిన ముథోల్ గురుకుల పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గతంలో ఇక్కడ విద్యను అభ్యసించిన విద్యార్థులు జాతీయ స్థాయిలోని ప్రముఖ విద్యాసంస్థల్లో సీటు సాధించి ఉన్నత స్థాయికి ఎదగడం తమ ప్రాంతానికి ఎంతో గర్వకారణమని తెలిపారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించేందుకు దోహద పడతాయని అన్నారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి జోనల్ స్థాయి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలతోనే విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించొచ్చని తెలిపారు. క్రీడలతో విద్యార్థులకు ప్రత్యేకంగా గుర్తింపు లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంతోపాటు క్రీడల్లో సైతం నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సూచించారు. గురుకులాలు క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడంలో ప్రముఖ విద్యా కేంద్రాలుగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు పోటీల్లో గెలుపొందడానికి సర్వశక్తులు ఒడ్డి పోరాడాలన్నారు. జోనల్ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని వెల్లడించారు. మొదటి రోజు పలు క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ టి.ఫ్లోరెన్స్ రాణి, జోనల్ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ సి.నర్సింహారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరంజన్, మండల విద్యాధికారి రమణారెడ్డి, మాజీ జడ్పిటిసి లక్ష్మీనర్సాగౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ సాయిరాం, బిజెపి మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఎంపిటిసి దేవోజి భూమేష్, నాయకులు తాటివార్ రమేష్, మోహన్ యాదవ్, సప్పటోల్ల పోతన్న, ధర్మపురి శ్రీనివాస్, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు స్వల్ప అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్ : సీసీఐ పత్తి కొనుగోళ్లలో ఈ సంవత్సరం నుంచి ప్రవేశపెట్టిన నిబంధనలను వ్యతిరేకిస్తు రాష్ట్ర వ్యాప్తంగా జిన్నింగ్ మిల్లుల యజమానులు కొనుగోళ్లను నిలిపేశారు. ఈ విషయమై సోమవారం ప్రయివేట్ వ్యాపారస్తులు, సీసీఐ అధికారుల మధ్య చర్చలు జరిగాయి. దీంతో వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. సీసీఐ లెవల్ వన్, టూ, త్రీ ఇలా ఎన్ని జిన్నింగులు ఉంటే అన్ని జిన్నింగులకు లెవల్స్‌ను ఇస్తుంది. ఇది ఫ్యాక్టరీలో ఉన్న సౌకర్యాలు, ఫైర్ సేఫ్టీతో పాటు బెల్స్ ధరను బట్టి లెవల్స్‌ను కేటాయించారు. అయితే ఆదిలాబాద్‌లో ఏ, బీలో మొత్తం 17 జిన్నింగులను ఏర్పాటు చేశారు. లెవల్స్, బెల్స్ ధరతో సంబంధం లేకుండా సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన జిన్నింగ్ మిల్లులకు పత్తిని పంపాలని వ్యాపారస్తులు డిమాండ్ చేశారు. వ్యాపారులు, ప్రయివేట్ ఫ్యాక్టరీ యజమానులకు మధ్య ఈ విషయమై చర్చలు కొనసాగాయి. స్పష్టత వచ్చే వరకు కొనుగోళ్లు చేయబోమని జిన్నింగ్ మిల్లుల యజమానులు పేర్కొన్నారు. చర్చలు సఫలం కాగా కొనుగోళ్లు యధావిధిగా సాగాయి.



నిలిచిన కొనుగోళ్లతో.. వెయిటింగ్‌లో వాహనాలు

కొనుగోళ్లు నిలిచిపోయే విషయం తెలియక రైతులు పత్తి బండ్లను పెద్ద ఎత్తున తీసుకొచ్చారు. ఉదయం 11గంటలు దాటినా కొనుగోళు ఎందుకు ప్రారంభించడం లేదని ఆరా తీశారు. ప్రయివేట్ వ్యాపారులు, సీసీఐ మధ్య ఉన్న నిబంధనల విషయం తెలుసుకున్నారు. ముందస్తుగా సమాచారం ఇస్తే పత్తిని తీసుకువచ్చే వాళ్ళం కాదని, మార్కెట్‌కు తీసుకువచ్చిన తరువాత ఈ విషయం చెబుతున్నారని రైతులు మండిపడ్డారు. విషయం తెలియక తాము ఉదయం 6గంటల నుంచే మార్కెట్ యార్డుకు వచ్చామన్నారు. కొనుగోళ్లు నిలిచిపోయిన కారణంగా వాహనం వెయిటింగ్ చార్జీలు పడతాయని ఆవేదన చెందారు.



పంజాబ్ చౌక్‌లో రైతుల రాస్తారోకో

మరో పక్క కొనుగోళ్లను చేపట్టాలని రైతులు పంజాబ్ చౌక్‌లో రాస్తారోకోకు దిగారు. ఉదయం నుంచి పడిగాపులు గాస్తున్న పత్తిని మాత్రం కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మార్కెటింగ్ ఏడీ గజానంద్, కార్యదర్శి మధుకర్ ధర్నా స్థలానికి చేరుకున్నారు. సీసీఐ కొత్త నిబంధనలను తొలగిస్తామని హైదరాబాద్‌లో జరిగిన చర్చల్లో ఒప్పుకుందని, పత్తి కొనుగోళ్లను యధవిధిగా కొనసాగుతాయని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కట్ల హమ్మయ్య కుమారుడు క్యాన్సర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో స్థానిక మాజీ సర్పంచ్ కందుల కళ్యాణి అశోక్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తి క్యాన్సర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని అమ్మ ఫౌండేషన్ దృష్టికి రావడంతో వారు మాజీ సర్పంచ్ కందుల కళ్యాణిని సంప్రదించగా సానుకూలంగా స్పందించి ఐదువేలు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేసినట్లు అమ్మ ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నవేని భాను ప్రసాద్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, కట్ట వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ సభ్యులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్, ఉమీద్ ఫౌండేషన్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని, జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని చిలుకూరి లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే పలువురికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.



భారతరత్న, స్వాతంత్ర్య సమరయోధుడు, దేశం మొదటి విద్యా మంత్రి అబ్దుల్ కలాం అని కొనియాడారు. కార్యక్రమంలో ఉమీద్ ఫౌండేషన్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, టీఎండబ్ల్యూఓ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అర్పత్ ఖాన్, అబ్దుల్ ఖాసిం పాల్గొన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వేలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని తన స్వగ్రామమైన కల్లూరుగూడాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సర్వేలో వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు.



రోడ్లు ఇలా.. ప్రయాణమెలా..?

- భారీ వర్షాలకు గుంతలుగా మారిన రింగ్ రోడ్డు
- 108 అంబులెన్స్ వెళ్లలేని దుస్థితి
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు





నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని అనేక మారుమూల గ్రామాల్లో రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి. గత జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలతో ఎక్కడ చూసిన కోతకు గురైన రోడ్లు, కంకర తెలి గుంతల రోడ్లుగా దర్శన మిస్తున్నాయి. మండలంలో మొత్తం 28 గ్రామపంచాయతీలు ఉండగా ముఖ్యంగా రింగు రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. మండలంలో ఎక్కువ పంచాయతీలు ఈ రింగ్ రోడ్డు పరిధిలోనికే వస్తాయి. మండలం నుంచి ప్రారంభమైన ఈ రోడ్డు అంజి, వడగావ్, వాల్గొండ, హీరాపూర్, దస్నాపూర్, డొంగర్‌గావ్, కేస్లాపూర్ పంచాయతీల మీదుగా ముత్నూరు వరకు వెళ్తోంది. సుమారు 26కిలోమీటర్లు రింగు రోడ్డు ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు, ప్రస్తుత ఎంపీ నగేష్ అప్పుడు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు బీటీ రోడ్డు వేశారు. దాదాపు 24 ఏండ్ల కింద నిర్మించిన ఈ రోడ్డుకు తరువాత ప్రభుత్వాలు, రాష్ట్రం సైతం వేరైనా ఈ రోడ్డుకు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎక్కడ చూసినా కంకర తేలి గుంతల మయంగా మారింది. ఈ రోడ్డు పై ప్రతి రోజు పదుల సంఖ్యలో వివిధ రకాల వాహనాలు వెళుతుంటాయి. రోడ్డు అధ్వానంగా మారడంతో అత్యవసర సమయంలో 108, అవ్వల్ అంబులెన్స్ సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామాల నుంచి ఆదివాసీ ప్రజలు ప్రతీ నిత్యం వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రావల్సి వస్తోంది. అయితే ఈ రోడ్డు బాగా లేక పోవడంతో అత్యవసర వేళలో ఆటోల్లో వెళ్లాలంటే అధిక చార్జీలు ఇవ్వాల్సిందేనని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డుపై దృష్టి సారించాలని, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అత్యవసర వేళలో ఇబ్బంది పడుతున్నాం

రింగ్ రోడ్డు గుంతలమయంగా మారడంతో అత్యవసర వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నాం. 108 అంబులెన్స్ సైతం రావాలంటే గంటల తరబడి సమయం పడుతుంది. రాత్రి వేళల్లో మా బాధలు దేవుడికే తెలుసునని అన్నారు. ప్రయివేటు ఆటోలకు అధిక చార్జీలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.



గెడం రాజేష్, వాల్గొండ

ప్రజాప్రతినిధులు ఈ రోడ్డుపై దృష్టి సారించాలి

ప్రస్తుతం టూ వీలర్ బండి ఉంటేనే సకాలంలో మండల కేంద్రానికి చేరుకుంటాం. మహిళలు పిల్లలతో వెళ్లాలంటే ప్రయివేటు వాహనాలే దిక్కు అని తెలిపారు. రింగ్ రోడ్డు శిథిలమవడంతో కొత్త ఆటోలు ఇక్కడికి రావు. వర్షాకాలంలో మా బాధలు ఎక్కువగా ఉంటాయి. విత్తనాలు, ఎరువులు తెచ్చుకోవాలన్న ఆటోలకు అధిక చార్జీలు ఇవ్వాల్సిందే.



ఉయిక శంభు, వాల్గొండ

కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

సమగ్ర కుటుంబ సర్వేతో బడుగు, బలహీన వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయపరంగా అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ అన్నారు. అందుకు ప్రజలు సహకరించాలన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తన నివాసానికి వచ్చిన ఎన్యూమరేటర్లకు భర్త బుజంగరావుతో కలిసి కుటుంబ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చాక దేశంలోనే మొట్టమొదటిసారి తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల గణన కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కుల గణన కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సర్వేలో కులాలవారీగా, మతాలవారీగా, కుటుంబాల ఆర్థిక, రాజకీయ, సామాజిక, స్థితిగతులను ప్రభుత్వం తెలుసుకొని వారి అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు చేపట్టనున్నట్టు తెలిపారు. సమాచారమంతా గోప్యంగా ఉంటుందన్నారు. సామాజిక లెక్క సరిగా ఉంటే మన హక్కులను మనమే పొందవచ్చని తెలిపారు.

కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం పాల్గొని అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అబుల్ కలాం ఆజాద్ గురించి ఆయన చేసిన కృషి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణపతి రఘు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి యాకూబ్ అలీ, ఎన్సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, సిబ్బంది ముబారక్, 32 తెలంగాణ బెటాలిన్ స్టాఫ్ రవి కుమార్, ఎన్సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబుల్ కలాం అజాద్ అడుగు జాడల్లో నడువాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

స్వాతంత్ర్య సమర యోధుడు భారత రత్న మౌలానా అబుల్ కలాం అజాద్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడువాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశ మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలనా అబుల్ కలాం అజాద్ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. మహాత్మా గాంధీజీతో కలిసి అనేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారన్నారు. దేశం కోసం వారు అందించిన సేవలు మరవలేనివన్నారు. నేటి యువత ఆయన చూపిన మార్గంలో నడువాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్ : భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఇతర జిల్లా అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశానికి అందించిన సేవలను వక్తలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. 11 ఏండ్లు విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించి, జాతీయ విద్యా విధానం అమలు చేశారన్నారు. రచయితగా, కవిగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయవేత్తగా అనేక సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అబుల్ కలాం



నిర్మల్



నిర్మల్

ఆజాద్ అని కీర్తించారు. ఆయన జయంతి సందర్భంగా జిల్లాలోని పాఠశాలల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించడంతో పాటు విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను మైనార్టీలు సద్వినియోగం చేసుకొని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మోహన్‌సింగ్, సీపీఓ జీవరత్నం, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్, మెప్మా పీడీ సుభాష్, మైనారిటీ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ...

జిల్లా కేంద్రంలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్ హాజరయ్యారు. కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్, కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షులు మారుగొండ రాము, పలువురు నాయకులతో కలిసి మౌలాన అబుల్ కలాం, భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడిగా, భారతదేశ మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, సొసైటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉర్దూ భాషాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని భజరంగ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ముషాయిరా, ఉర్దూ కవి సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి పూలమాలలు శాలువాలతో సత్కరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ ఉర్దూ కవులు తమ షాహీరీలను చదవి వినిపించారు. ఈ కార్యక్రమంలో కిజర్ పాషా, ఎంఏ కయ్యూమ్, ఎంఏ షకీల్, మొహమ్మద్ రఫీక్, షేక్ ఖాలీద్, నూర్‌ఖాన్, సయ్యద్ షౌకత్ అలీ, సయ్యద్ షాహిద్ అలీ, ఫయాజ్ షామా, షేక్ ఖలీం, సలీం, నదీమ్, అతిక్ ఉర్ రహమాన్, ఉమేర్, తలా చౌష్, అఖీమ్, కర్మ, అజీజ్, షేక్ నసీర్, బూర్ల శంకరయ్య, దాసరి ఆశన్న, భరత్ శ్రవణ్ నాయక్ పాల్గొన్నారు.

ముధోల్ అభివృద్ధిలో భాగ్యస్వాములు కావాలి

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఇరిగేషన్, అభివృద్ధికి ఆయా పార్టీల నాయకులు భాగస్వామ్యం కావాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం ముధోల్‌లో మహాత్మ జ్యోతిబాపూలే బాలికల జూనియర్ కళాశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్య, వైద్యం, ఇరిగేషన్, అభివృద్ధిలో రాజకీయాలకు చోటుండొద్దని ఆయన హితవు పలికారు. ఎన్నికల అప్పుడే రాజకీయాలు చేయాలని సూచించారు. ముధోల్ అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. త్వరలో ముధోల్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు కానున్నట్టు ఆయన చెప్పారు. ముధోల్‌లో త్వరలో మహిళా డిగ్రీ కళాశాల మంజూరు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. విద్యార్థులు చదువుల్లో బాగా రాణించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల కష్టాలను గుర్తు చేసుకుంటూ, విద్యార్థులు చదువుల్లో ముందుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమృత, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, మున్నూరుకాపు సంఘం తాలుకా అధ్యక్షుడు రోల్ల రమేష్, నాయకులు నర్సాగౌడ్, తాటివార్ రమేష్, శ్రీనివాస్, సప్పటోల్ల పోతన్న, దేవోజీ భూమేష్, జీవన్, మోహన్, దత్తాత్రి, నిమ్మ పోతన్న, వెంకట్‌రావ్ పాల్గొన్నారు.



కోత దశలో వరి పంట..నేలతడి ఆరక తంటా

- మడుల్లో ఓర కాల్వలు తీసుకుంటున్న రైతులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

సదర్‌మాట్ ఆయకట్టులో వరి పంట కోతదశకు చేరింది. పంటకు నీటి తడుల అవసరం సరిపోగా కెనాల్‌లో ఇంకా నీరు పారుతోంది. దీంతో లోతట్టు గలుమల కింద ఉన్న పంట పొలాలు తడి ఆరడం లేదని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడి ఆరని లోతట్టు పొలాల రైతులు నీరును మళ్లించేందుకు మడుల్లో ఓడ కాలువలు తీసుకుంటున్నారు. కోత సమయం దాటి పోతున్నా భూమి ఎండక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడులు అవసరం లేని, తూముల కింది పొలాలకు నీటి సరఫరా నిలిపేయాలని కోరుతున్నారు.

దిగుబడులపై ప్రభావం..

సదర్‌మాట్ ఆయకట్టు కింద ఈసారి రైతులు దొడ్డు, సన్నరకం వరి సాగుచేశారు. స్వల్ప కాలిక దొడ్డ రకాలు ఎంటీయూ-1010, కూనారం, జేజీఎల్-1153, 1156 వేసుకోగా సదరు పంటలు ఎండుబారినాయి. అలాగే మధ్య, ధీర్ఘ కాలిక రకాలైన ఆర్ఎన్ఆర్, బతుకమ్మ, రైతుమిత్ర, జై శ్రీరాం, సాయిరాం, కావేరి చింటు రకాలు కోత దశలో ఉన్నాయి. వరి గొళిక ఎండుతున్న సమయంలో పది రోజుల ముందుగానే రైతులు పొలాన్ని ఆరబెడతారు. భూమి ఆరితేనే పంట కోయడానికి అనువుగా మారుతుంది. నేల తడిగా ఉంటే వరి కోసే హార్వెస్టరులు నడవలేక సమయం దాటిపోయి పంట నేలకొరిగే ప్రమాదం ఉన్నట్టు చెబుతున్నారు. దీంతో ధాన్యం దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

భూమి ఎండక ఇబ్బందిగా ఉంది

పసుపుల సంతు, రైతు, శ్రీరాంనగర్



వరి పంట కోతకు రాడంతో పదిహేను రోజుల క్రితమే నీటి తడులు ఆపేసి పొలం ఆరబెట్టాను. గలుమలో నీరు రావడంతో భూమి ఆరడం లేదు. నేల తడిగా ఉండటంతో వరి కోసే యంత్రాలు నడిచే పరిస్థితి లేదు. కోత సమయం దాటిపోతుంది. పంట నేలకొరుగుతుంది.

తూములను మూసేస్తున్నాం

వీరన్న, జేఈ

ఆయకట్టులో వరి పంట కోతకు వచ్చిన క్రమంలో లోతట్టు తూములను మూసి ఉంచాము. ఆలస్యంగా వేసుకున్న కొంత మంది రైతుల పొలాలకు నీటి తడులు అవసరం ఉన్నందున కొంత మేరకు కెనాల్‌లో నీరును వదులుతున్నాం. వారం పాటు నాలుగు అడుగుల మట్టంతో నీరు సరఫరా చేస్తాం. తర్వాత పూర్తిగా నిలిపేస్తాం.

విద్యార్థులు పఠనా సామర్థ్యం పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-నేరడిగొండ

పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పఠనా సామర్థ్యం పెంపొందించుకోవాలని ఎంఈఓ భూమారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వడూరు ఎంపీపీఎస్ పాఠశాలలో రూమ్ టు రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలానికి ఒక రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్, ఈ మోడల్ లైబ్రరీలో వివిధ రకాల రంగురంగుల కథల పుస్తకాలను, పఠనా సామాగ్రి ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థుల్లో విద్య సామర్థ్యాలు పెంపొందించవచ్చని, తల్లిదండ్రులు వారి ఇంటి వద్ద మంచి విలువలతో కూడిన విద్యాభ్యాసం అందించాలని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులతో పాటు సుశిక్షులైన ఉపాధ్యాయుల ద్వారా బోధన జరుగుతుందని తెలియజేశారు. అనంతరం ఎంఈఓ భూమారెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్, ఉపాధ్యాయులు, రూమ్ టు రీడ్ మండల కోఆర్డినేటర్ ఎండీ ఆదిల్ అలీ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | నవంబర్ 12, 2024 | www.navatelangana.com

సీహెచ్‌పీని సందర్శించిన కార్పొరేట్ క్వాలిటీ జీఎం

నవతెలంగాణ రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీని కార్పొరేట్ క్వాలిటీ జీఎం రవి కుమార్ సందర్శించారు. క్వాలిటికి సంబంధించిన విషయాలపై చర్చించి పలు సూచనలు చేశారు. బెల్లంపల్లిలో క్వాలిటీకి సంబంధించిన విషయాలను ఏరియా జీఎం శ్రీనివాస్ వివరించారు. బొగ్గు రవాణాకు సంబంధించిన నాణ్యతాపరమైన విషయాలను అధికారులకు తెలియజేశారు. అనంతరం జీఎం రవికుమార్‌ను శాలువతో సత్కరించి మొక్కను అందించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఉమాకాంత్, సీహెచ్‌పీ ఇన్‌చార్జి కోటయ్య క్వాలిటీ ఇన్‌చార్జి రవి, పాల్గొన్నారు.

తప్పిదాలు లేకుండా సర్వే చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



కులగణన సమగ్ర సర్వేలో తప్పిదాలు లేకుండా సర్వే నిర్వహించాలని డీఎల్‌పీఓ ఉమర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న సమగ్ర సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో భాగంగా కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన అన్ని కాలమ్స్‌ను పూరించాలని తెలిపారు. ఇన్యూమరేటర్లు సర్వేలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శించి కుల కులగణనకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజాద్ పాషా, మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గిరిజన క్రీడోత్సవాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 12 బంగారు, 10 వెండి, 5 కాంస్య పథకాలు సాధించడంతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడంతో డీటీడీఓ రమాదేవి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఏకాగ్రతతో చదువులోనూ రాణించాలన్నారు. ఈ నెల 6, 7, 8 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన సంక్షేమ బాలికల క్రీడా పోటీలలో జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాలకు చెందిన 14-17 సంవత్సరాల వయసు గల విద్యార్థినులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్, కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్‌లో నిర్వహించిన హ్యాండ్ బాల్ పోటీలు, ఉట్నూర్‌లో నిర్వహించిన ఖోఖో పోటీలలో పాల్గొని బంగారు పథకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలో రాణించాలని, సమాజంలో మంచి గుర్తింపును సాధించుకోవాలని అన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగడంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ క్రీడాధికారి మీనారెడ్డి, ఏసీడబ్ల్యూఓ ఉద్ధవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగు, శిక్షకులు విద్యాసాగర్, రవీందర్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేతగా తుకారాం వారియర్స్



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ మైదానంలో డెయిలీ క్రికెట్ యూత్ నిర్వహించిన డబ్ల్యూపీఎల్ సీజన్ రెండులో 10 జట్లు పాల్గొనగా తుకారాం వారియర్స్ జట్టు విజయం సాధించింది. మొదటి బ్యాటింగ్ చేసిన అజయ్ రేజర్స్ జట్టుపై నిర్ణీత 10 ఓవర్లలో 74 పరుగులు చేసింది. 75 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన తుకారాం వారియర్స్ జట్టు లక్ష్యాన్ని సునాయాసంగా చేదించింది. ఫైనల్ మ్యాచ్ కావడంతో ఒక దశలో ఒత్తిడికి గురైన పక్షంలో 30 బంతులు 27 పరుగులు చేయాల్సిన సమయంలో అనంతరం తుకారాం జట్టు వారియర్స్ మొదటి బహుమతిగా రూ.30,000, రెండవ బహుమతి జడ్పీటీసీ అజయ్ రన్నర్స్‌కు రూ.15000, బహుమతితో పాటు షీల్డ్ అందజేశారు.

ఉద్యోగ అవకాశాలకు ప్రభుత్వాలపై పోరు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరు బాటకు సిద్ధమవుతున్నామని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేందర అన్నారు. రాష్ట్రంలోని ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం నిరుద్యోగులు ఉద్యోగం దక్కేంత వరకు నెలకు రూ.3116 నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా కార్యదర్శి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలం చెందారని ఆరోపించారు. విద్యాభ్యాసం పూర్తయిన ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, కానీ అనేక సంవత్సరాలుగా పాలకులు ఆ బాధ్యతను విస్మయించారన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల ముసాయిదాలో యువజన అంశాలను పొందుపరిచారని, ఆ అంశాలను నేటికి అమలు చేయడం లేదన్నారు. మాధకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా 3వ మహాసభలు డిసెంబర్ 9వ తేదీన నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కోదురుపాక మహేష్, వర్కుల్ రాకేష్, బావునే వికాస్, సుదీర్, సాయి, రమ్య, దీప్తి పాల్గొన్నారు.

ఎంఈఓకు ప్రజాసంఘాల సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతన మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన రాథోడ్ సుభాష్‌ను ప్రజాసంఘాల నాయకులు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ప్రజల, తల్లిదండ్రులు సహకారంతో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.



గిరి ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వరరావుతో కలిసి ప్రధానమంత్రి జన జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ యోజన కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ గిరిజన గ్రామాలలో మౌలిక వసతులు కల్పించేందుకు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజనులకు పక్కా గృహాలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరా, ఆయుష్మాన్ భారత్ కార్డులు, గ్రామాలను మండల, జిల్లా కేంద్రానికి అనుసంధానం చేసే విధంగా రహదారుల నిర్మాణం, మొబైల్ కనెక్టివిటీ, ఇంటర్నెట్, ఆరోగ్య పోషకాహార, విద్య, నైపుణ్య శిక్షణ వంటి మౌలిక సదుపాయాలను కల్పించే ప్రతిపాదనలను రూపొందించి 3 రోజులలోగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవికి నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కారించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆర్డీఓ లోకేశ్వర్ రావులతో కలిసి ప్రజావాణిలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల సర్వేలో అధికారులు సమన్వయంతో పని చేసి సర్వే ప్రక్రియకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గురుకులాలను సందర్శించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేతనాల కోసం కార్మికుల నిరసన

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చెత్త ట్రాక్టర్‌తో ఆందోళన
- ఎంపీడీఓ హామీతో ఆందోళన విరమణ



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చెత్త ట్రాక్టర్‌తో నిరసన తెలుపుతున్న కార్మికులు

నవతెలంగాణ-బెజ్జూర్

వేతనాల కోసం ఏడు నెలలుగా ఇబ్బంది పడుతున్న తమను అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బెజ్జూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు వసంత్, శంకర్, మొండి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వేతనాల కోసం అధికారుల తీరుకు నిరసనగా ఎంపీడీఓ కార్యాలయం ముందు చెత్త ట్రాక్టర్‌తో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. తమ పని చేస్తున్న వేతనాలు ఇవ్వడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బెజ్జూరు గ్రామపంచాయతీలో 9 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని, ఏడు నెలలుగా వేతనాలు రాక తాము ఎలా జీవించాలని ప్రశ్నించారు. అధికారులు స్పందించి వెంటనే తమ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంపీడీఓ గౌరీ శంకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారంను సంప్రదించగా వేతనాలు ఇవ్వాల్సింది వాస్తవమేనని, గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారి లేనందున ఆలస్యం అవుతున్నట్లు తెలిపారు. రెండు నెలల వేతనాలు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు రెండు రోజుల్లోగా పరిష్కారిస్తామని ఎంపీడీఓ గౌరిశంకర్ హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తే మరోసారి ఉద్యమిస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలి



నవతెలంగాణ-వాంకిడి

జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని పిప్పర్ గొంది గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉపాధిహామీలో అనుమతించిన పనులను గ్రామ ప్రజలకు వివరించి, పనులను జాబ్ కార్డు కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీని ద్వారా వారి భూమిని అభివృద్ధి చేసుకొని పంట దిగుబడులు పెంచుకోవాలని వివరించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలో ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించేలా పనులను గుర్తించి, ప్రణాళిక తయారు చేయాలన్నారు. పిప్పర్ గొంది, పాటగూడ గ్రామ పంచాయతీల నర్సరీ స్థలాన్ని సందర్శించి వచ్చే సంవత్సరం డిమాండ్‌కు అనుగుణంగా మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. అనంతరం పిప్పర్‌గొంది, పాటగూడ గ్రామ పంచాయతీలలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక ఇంటింటి సమగ్ర సర్వే విధానాన్ని పరిశీలిస్తూ గ్రామ పంచాయతీలో ఉన్న అన్ని కుటుంబాలు సర్వేలో వచ్చేలా సర్వే నిర్వహించాలని, సర్వే ఫామ్‌లోని అన్ని అంశాలు కుటుంబ సభ్యులు చెప్పిన ప్రకారం నింపాలని, సర్వే అంశాలను బహిర్గతం కాకుండా గోప్యత పాటించాలని ఎన్యుమరేటర్‌లను ఆదేశించారు. ఆయన వెంట ఈసీ మోసిన్, టీఏ అంబాజి, పంచాయతీ కార్యదర్శులు నియమాలిక, అన్నపూర్ణ ఉన్నారు.

మౌలానా అబుల్ కలాం జీవితం ఆదర్శనీయం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆచరించిన జీవితం అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారి రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన అబుల్ కలాం జయంతి పురస్కరించుకొని వేడుకలకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఎన్నో వినూత్న సంస్కరణలతో విశిష్ట సేవలు అందించాలని, విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. దేశంలో విద్యారంగ అభివృద్ధికి అహర్నిశలు పాటు పడ్డారని, దేశానికి ఆజాద్ అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు వివిధ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎంఎం హెల్ప్ లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతిలో జామా మసీద్ అధ్యక్షుడు



ఫయాజ్, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ఎమ్ఎమ్ హెల్ప్ లైన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబెద్ బిన్ యాహీయా, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, షర్ఫుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిజాం, ఉపాధ్యాయుడు ఎండీ అష్రాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అడ్వకేట్ రజి హైదర్‌తో పాటు పలువురు న్యాయవాధులు మౌలాన అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

నవతెలంగాణ-బెజ్జూర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని స్థానిక సంస్థల్లో పార్టీ బలోపేతం చేసి ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు పరచడంలో విఫలమైందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలనలో ప్రపంచ దేశాలు భారత దేశం వైపు చేసేల పాలన సాధిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల్లో మోడీ గ్రాఫ్‌ను వాడుకుంటు అధిక సీట్లు సాధించేలా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు, మాజీ ఎంపీపీలు కొప్పుల శంకర్, కోండ్ర మనోహర్ గౌడ్, నాయకులు ఎల్ముల మల్లయ్య, కుమ్మరి తిరుపతి, జాడి దిగంబర్, రాకేష్, లింగాల శంకరయ్య వసీఉల్లా ఖాన్, శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- కలెక్టరేట్ ఎదుట 48 గంటల ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, వీఓఏల సంఘం గౌరవాధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన 48 గంటల ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు బకాయి ఉన్న స్త్రీ నిధి ఇన్సెంటివ్ వెంటనే గ్రామ సంఘాలకు చెల్లించాలన్నారు. గ్రామ సంఘం నుండి రూ.3000 గౌరవ వేతనం ఇవ్వాలని, గ్రామ సంఘానికి ల్యాప్ ట్యాప్ సౌకర్యం కల్పించాలన్నారు. మూడు నెలల రెన్యువల్ పద్ధతి తీసివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.20,000ల వేతనం ఇవ్వాలనీ, వీఓఏలకు రూ. 20 లక్షల బీమా సౌకర్యం కల్పించి ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, ఐకేపీ వీఓఏల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమా, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుద్ధు, రోజా, జిల్లా కోశాధికారి ధన్‌రాజ్, ఉపాధ్యక్షులు సంతోష్, నాయకులు తిరుపతి, వెంకటేష్, అన్నపూర్ణ, భరత్, రవీందర్, భగవంత్‌రావ్, సతీష్, మధుకర్ స్వప్న, తిరుపతి, మహేశ్వరీ పాల్గొన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని టోంకిని సిద్ధిహనుమాన్ మహా పాదయాత్ర మంగళవారం కొనసాగుతున్న నేపథ్యంలో సిర్పూర్(టి) నుండి కౌటాల మార్గంలో భారీ వాహనాలను అనుమతి లేదని ఎస్సై కమలాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగజ్‌నగర్ నుండి కౌటాలకు వెళ్ళు వారు కౌటాల నుండి కాగజ్‌నగర్‌కు వచ్చే వారు ఇతర మార్గాలైన ఈస్గాం మీదగా వయా డబ్బా వైపు నుండి ప్రయాణం చేయాలని, టొంకిని హనుమాన్ ఆలయ పరిసర ప్రాంతాలలో రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆ వైపు మార్గం నుండి కాకుండా మరో మార్గం ద్వారా ప్రయాణం చేయలని కోరారు. ప్రజలు, వాహనదారులు సహకరించాలన్నారు.

క్రీడల్లో రాణించిన వాసవి విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి హై స్కూల్ చదువుతున్న విద్యార్థినులు బొనగిరి సానిక సబ్ జూనియర్ విభాగం, చిప్ప యోచన అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు తరపున పాల్గొన్న క్రీడాకారులు మొదటి స్థానంలో నిలిచారు. క్రీడాకారులతో పాటు పీఈటీ గోగర్ల సాయిని సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ క్రాంతి కుమార్, మేనేజ్‌మెంట్ సభ్యులు, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి అధ్యయనం చేసి నిత్యం ప్రజల మధ్య ఉంటూ సైనికుల్ల పనిచేయాలని నియోజవర్గ కన్వీనర్ కాశిపాక రాజు, మండల యూత్ కన్వీనర్ అస్లాం బిన్ అబ్దుల్లా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ యూత్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు అహర్నిశలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎలములే నందజీ, పనస లక్ష్మణ్, కారం రాజేష్, మండల కో కన్వీనర్ షేక్ చాన్, సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఎన్నుకున్నారు. మండల యూత్ అధ్యక్షుడిగా రవి వెర్మా వైస్ ప్రెసిడెంట్స్‌గా గడం వినోద్, దుర్గం వికాస్, జనరల్ సెక్రటరీగా సేండ్ రత్నాకర్, సెక్రటరీలుగా జరుకుల సంతోష్, సోఫీ, జాయింట్ సెక్రటరీగా అవినాష్, దుర్గం గౌతమ్, కోశాధికారిగా గజిరెడ్డి మోహన్, మండల జనరల్ సెక్రటరీగా జెల్ల రాజేష్, పట్టణ యూత్ అధ్యక్షులుగా పార్లపెల్లి సందీప్, కమిటీ సభ్యులుగా ఖండే సునీల్, దుర్గం అరవింద్, అజ్మీరా ప్రకాష్, వైజ్ సైఫ్, చౌదరి సంతోష్, అమీర్ యాసర్ ఎన్నికయ్యారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

నవతెలంగాణ-వాంకిడి

మండలంలో ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహించారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సర్వేకు సహకరించి ఇంటింటికి వస్తున్న సిబ్బందికి అన్ని వివరాలను ఇవ్వాలని, అందరి సహకారంతోనే ప్రభుత్వం అనుకున్న లక్ష్యం పూర్తవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించి సర్వేను విజయవంతం చేయడానికి తమవంతు కృషి చేయాలని మహమ్మద్ రియాజ్ అలీ కోరారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
మంచిర్యాల
మంగళవారం | నవంబర్ 12, 2024 | www.navatelangana.com

పత్తి కొనుగోళ్లు యథాతథం

నవతెలంగాణ-తాండూర్



నేటి నుంచి పత్తి కొనుగోళ్లు యధాతథంగా జరుగుతాయని మార్కెటింగ్ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. రైతుల సంక్షేమం, ప్రాధాన్యతల దృష్ట్యా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకుల ఆధ్వర్యంలో సీసీఐ సి అండ్ ఎండి లలిత కుమార్ గుప్తా రాష్ట్ర కాటన్ జిన్నింగ్ మిల్లుల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సభ్యులతో, సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరపటం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో సీసీఐ ద్వారా కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలుపై జిన్నింగ్ మిల్లర్ల అభ్యంతరాలను చర్చించి పరిష్కరించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పత్తి మార్కెట్లు సీసీఐ కొనుగోలు కేంద్రాలు యధాతథంగా కొనుగోళ్లు సాగుతాయని తెలిపారు. రైతులు పత్తి పంటను కొనుగోలు కేంద్రాల వద్ద నేరుగా అమ్ముకోవచ్చు నని అన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని ఫిర్దోస్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇసాక్ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడినట్టు లక్షెట్టిపేట్ ఎస్ఐ-2 రామయ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత పది రోజుల కింద ఇసాక్ కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వరంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున వచ్చి చూసే సరికి దొంగలు చొరబడ్డట్టు గుర్తించారు. రూ.10 వేల నగదు, రెండు తులాల బంగారం దొంగతనం అయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గ్రూప్-3 పరీక్ష కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ-మందమర్రి

ఈ నెల 17, 18వ తేదీల్లో జరగనున్న గ్రూప్-3 రాత పరీక్ష కేంద్రాలను మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌లు పరిశీలించారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు సోమవారం సీఐ, ఎస్ఐలు ఆయా కేంద్రాలకు వెళ్లి పరీక్ష కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ హై స్కూల్, శ్రీ చైతన్య స్కూల్, సింగరేణి మహిళా జూనియర్ డిగ్రీ కళాశాల, తదితర కేంద్రాలను పరిశీలించారు.

కడుపు నొప్పితో బాధపడుతూ బాలుడి ఆత్మహత్య

నవతెలంగాణ-జైపూర్



మండల కేంద్రంలో నివాసముంటున్న ఎల్కపల్లి మనోజ్(16) కడుపునొప్పి భరించలేక ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. గత కొంత కాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న మనోజ్ తండ్రి స్వగ్రామానికి వెళ్లడం చూసి రాత్రి 9 గంటల సమయంలో ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వీణవంక మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన ఎల్కపల్లి రాజేందర్ గత కొంత కాలంగా కుటుంబంతో కలిసి జైపూర్‌లో ఉంటున్నాడు. జైపూర్ పవర్‌ప్లాంట్ పని కోసం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన రాజేందర్ భార్య గత నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ఇద్దరు పిల్లలతో జైపూర్‌లో ఉంటున్నాడు. ఏమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రజక సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

రజక సంఘం జన్నారం పట్టణ నూతన కమిటీని సోమవారం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లూరి పెద్దన్న, కార్యదర్శిగా కుదురుపాక నరేష్, ఉపాధ్యక్షుడిగా సట్ల భీమయ్య, కోదురుపాక కొమురయ్య కోశాధికారి నల్లూరి సత్యం, సలహాదారులుగా దర్రాజుల సురేశ్, ముక్కెర మల్లేష్, నల్లూరి గంగన్న, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రజకులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. వడ్డీ లేని రుణాలు అందించాలని కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



నవతెలంగాణ-తాండూర్

ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని సింగరేణి సంస్థ గోలేటి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం బెల్లంపల్లి సింగరేణి ధ్యాన మిత్ర కేంద్రంలో ఏర్పాటుచేసిన పత్రీజీ జన్మదిన వేడుకల్లో ఆయన సతీమణి ఉమాతో కలిసి పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఉరుకుల పరుగుల పోటీ ప్రపంచంలో సగటు మనిషికి ప్రశాంతత కరువైందని తెలిపారు. ఒత్తిడి కారణంగా నిద్రలేమి, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రహ్మ కుమారి ఆధ్యాత్మిక సంస్థ నిర్వాహకులు పద్మ, సంఘమిత్ర ధ్యాన కేంద్రం నిర్వాహకులు లక్ష్మణ్, కాసిపేట మల్లేష్, పుట్ల సురేష్, విజయ సాయి, దామర సమ్మయ్య, గుండ శంకర్, మనోహర్, శ్యామల పాల్గొన్నారు.

పశుగణన సమర్థవంతంగా నిర్వహించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ పశుగణనను సమర్థవంతంగా నిర్వహించాలని పశు వైద్య, పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఈ శంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని ఇటిక్యాలలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ భూమయ్య, పశు వైద్య సహాయకులు గంగ మల్లు, గోపాల మిత్ర అభి పాల్గొన్నారు.

గైర్హాజరు కాకుండా సక్రమంగా విధులు నిర్వర్తించాలి

నవతెలంగాణ నస్పూర్

ఉద్యోగులు గైర్హాజరు కాకుండా ఇప్పటికైనా సక్రమంగా విధులకు హాజరుకావాలని ఆర్కే-5, 6 గనుల గ్రూప్ ఏజెంట్ శ్రీధర్ అన్నారు. సోమవారం గైర్హాజర్ కార్మికులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరు అవుతున్న ఆర్కె-5 ఉద్యోగులకు గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝ సమక్షంలో సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. దాదాపుగా 30 మంది కార్మికులను గైర్హాజర్ గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి రాందాస్, సంక్షేమ అధికారి రణదీప్, అడిషనల్ మేనేజర్ శివయ్య, పిట్ సెక్రటరీ నర్సింగ్ రావ్, యాక్టింగ్ పీఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

గనిలో కార్మికుడికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిలో సోమవారం కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. అండర్ గ్రౌండ్‌లోని 4 ఎస్ 11, 15 డీప్ 28 లెవన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ జనరల్ మల్లూరు సొత్కు కిషోర్ జాకీ కొట్టె క్రమంలో ప్రమాదశాత్తు జారి గదవకు తాకింది. దీంతో ఒక్క సారిగా పండ్లు ఊడి పడడంతో పాటు గదవ, ప్రాంతంలో తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఎస్‌ఏ సోషల్‌కు మేమే అర్హులం

- బీఏ సోషల్ అభ్యర్థుల ఆందోళన
- బీకామ్ వారిని తీసుకున్నారని కలెక్టర్‌కు వినతి
- డీఎస్సీ బీఏ బీఈడ్ అభ్యర్థుల ఆవేదన



నవతెలంగాణ-హాజీపూర్

గత నెల విడుదలైన 2024 డీఎస్సీ ఫలితాల్లో సోషల్ స్టడీస్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందనీ బీఏ, బీఎడ్ అబ్యర్థులు ఆందోళన బాట పట్టనున్నారు. వాస్తవానికి డీఎస్సీ నోటిఫికేషన్‌లో పొందుపర్చిన అర్హతల ప్రకారం జీఓ ఎంఎస్ 25 ప్రకారం మూడు సంవత్సరాలు డిగ్రీలో ఏవేని రెండు సబ్జెక్టులు అయిన సోషల్ స్టడీస్ చదివి వుండాలి. కానీ బీకామ్, బీఎడ్ చేసిన అభ్యర్థుల వారు మూడు సంవత్సరాల కోర్సులో ఎక్కడ కూడా సోషల్ స్టడీస్ చదవలేదని వీరి వాదన. ఇటీవల ఖమ్మం జిల్లాలో ఇలాంటి విషయంలోనే 7 గురు హిందీ ఉపాధ్యాయులను తొలగించారు. వీరు డిగ్రీలో కనీసం మూడు సంవత్సరాల ఆప్షనల్ సబ్జెక్ట్ లేక పోవడంతో ఉద్యోగంలో చేరిన 20 రోజుల తరువాత తొలగించడం ఉంద్యోగంలోంచి తొలగించారు. దీంతో బీకామ్ అభ్యర్థులు కూడా వారి డిగ్రీలో సోషల్ స్టడీస్ లేకపోవడంతో బీఏ అభ్యర్థులు దీనిపై కోర్టుకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. సోమవారం బీఏ సోషల్ స్టడీస్ అభ్యర్థులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

గందరగోళంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ పోస్టులు 25 ఉండగా గత నెల విడుదలైన రిజల్ట్ ప్రకారం ఆ పోస్టులకు 1:3 ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి మెరిట్‌లో ఉన్న వారికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గత నెల 10న నియామక పాత్రలు అందించారు. అయితే ఈ ప్రక్రియలో జిల్లా విద్యాశాఖ అధికారులు నోటిఫికేషన్‌లో పొందుపర్చిన నియమాలను పాటించకుండా హడావుడిగా నియామక పాత్రలు అందించారని విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి గతంలో కూడా బీఎడ్ చేసిన బీకాం అభ్యర్థులకు ఎస్ఏ సోషల్‌కు అర్హులు కారని పలు మార్లు నిబంధనలు పెట్టారు. 2008 డీఎస్సీలో వీరికి ఎస్ఏ సోషల్ ఇవ్వలేదు. 2012లో ఎస్జీటీకి మాత్రం అర్హత ఇచ్చింది. ప్రస్తుత డీఎస్సీ నోటిఫికేషన్‌లో కూడా కనీసం మూడు సంవత్సరాల సోషల్ స్టడీస్ సబ్జెక్ట్ చదివిన వారు మాత్రమే అర్హులని స్పష్టంగా పొందుపర్చినట్లు బీఏ, బీఎడ్ అభ్యర్థులు చెబుతున్నారు. కానీ దీనికి విరుద్ధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన హడావుడిగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయడంతో 15 మంది వరకు అనర్హులు ఉన్నారని బీఏ, బీఎడ్ అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. విద్యాశాఖ పున్ణపరిశీలన చేసి జిల్లాలో ఉన్న 25 ఎస్ఏ సోషల్ పోస్టులకు అర్హత కలిగిన వారిని ఎంపిక చేయాలని కోరుతున్నారు. దీనికై న్యాయ పోరాటానికి సిద్ధం అంటూ కలెక్టరేట్, విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉద్యమం ఉధృతం చేయనున్నట్లు చెబుతున్నారు. నియామక పత్రాలు అందించే సమయంలో కూడా అర్హతలలో కూడా ఏమైనా లోటుపాట్లు వుంటే ఎప్పుడైనా తొలగించనునట్లు చెప్పారని బీఏ బీఎడ్ అభ్యర్థులు చెబుతున్నారు.

సర్వేలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

- ప్రత్యేక అధికారి కృష్ణ ఆధిత్య



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ప్రత్యేక అధికారి కృష్ణ ఆధిత్య అన్నారు. సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్‌లతో కలిసి మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని 5, 27 వార్డులలో సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో భాగంగా ఇండ్ల జాబితా ప్రక్రియ పూర్తి అయిందని, ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యుల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్లలో పూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నిర్దిత నమూనాలో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని, ఇంటి యజమానులు అవసరమైన పత్రాలతో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పూర్తి వివరాలు పొందుపర్చాలి

జైపూర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు పొందుపర్చాలని జిల్లా ప్రత్యేక అధికారి, పీడీ డీఆర్‌డీఓ కృష్ణ ఆధిత్య సూచించారు. షెట్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న సామాజిక ఆర్థిక రాజకీయ కుల సర్వే-2024 సర్వే తీరును సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పరిశీలించారు. ఇంటింటి సర్వే కొనసాగుతున్న తీరును ఎన్యూమరేటర్లను అడిగి తెల్సుకున్న ఆయన ఇంటింట సర్వే పూర్తి చేసిన ప్రొఫార్మాలు తనిఖీ చేశారు. సర్వే బృందాలకు సూపరవైజర్‌గా వ్యవహరిస్తున్న ఏకేపీ ఏపీఎం రాజకుమార్ వద్ద రిపోర్టులు పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ, ఐకేపీ ఏపీఎం రాజకుమార్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన జోనల్ స్థాయి క్రీడా పోటీలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం అట్టహాసంగా పదవ జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కాళేశ్వరం జోన్ క్రీడా పోటీలు తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని ఇందులో భాగంగానే మంచిర్యాలలో స్టేడియం నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని అన్నారు.





గురుకుల పాఠశాలలో క్రీడల కోసం తమ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని గురుకులాల అభివృద్ధిలో భాగంగా ఇటీవల లక్షెట్టిపేట పరిసరాలలో సమీకృత గురుకుల విద్యాలయానికి ప్రారంభోత్సవం చేయడం జరిగిందని పేర్కొన్నారు. విశిష్ట అతిథులుగా మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా బియ్యాల తిరుపతి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి, వార్డు కౌన్సిలర్ రాందేని సత్తెమ్మ, ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ రాందేని వెంకటేష్, పేరెంట్ కమిటీ ప్రెసిడెంట్ శ్రీనివాస్, విజయ్, తిరుపతి, సరిత, అఖిల, లింగన్న, మురళి, మహేందర్, కమలాకర్, పేరెంట్ కమిటీ సభ్యులు, హాజరైనారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-నస్పూర్



భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగంలో ఎన్నో వినూత్న ఆవిష్కరణలతో విద్యాభివృద్ధికి కృషి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరితో కలిసి హాజరై ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ విద్యా వ్యవస్థకు ఆజాద్ అందించిన సేవలను గౌరవించుకుంటూ ఆజాద్ జయంతి రోజున జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ మైనార్టీ దినోత్సవాలను జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యావ్యవస్థను పటిష్టం చేస్తూ ఐఐటిలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాల స్థాపనకు విశేష కృషి చేశారని, జాతిపిత మహాత్మాగాంధీ వెంట నడిచిన ముఖ్యులలో ఒకరైన ఆజాద్ 35 సంవత్సరాల వయస్సులోనే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పదవి నిర్వహించారని అన్నారు. హిందూ-ముస్లిం మధ్య శాంతియుతంగా ఒకతాటిపైకి తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. మహనీయుల ఆచరించి చూపిన సన్మార్గాలను యువత అనుసరిస్తూ దేశాభివృద్ధికి దోహదపడాలని తెలిపారు.

లక్షెట్టిపేట : పట్టణంలోని సీఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్ డేవిడ్ పాల్ మాట్లాడుతూ స్వాతంత్ర భారతదేశంలో తొలి విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తనదైన శైలిలో విద్యాభివృద్ధికి కృషి చేస్తూ దేశంలో గుణాత్మక విద్యకు మార్గదర్శి అయ్యారని కొనియాడారు. ఇతని జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవన్ని నిర్వహిస్తారని తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలలో ఉండాలని తెలిపారు.

సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు బోనస్

- కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా ప్రత్యేక అధికారి



నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వరి ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,320తో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నట్టు జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆధిత్య తెలిపారు. సోమవారం మండలంలోని షెట్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లింపు విషయం రైతులకు తెలియజేయాలని నిర్వాహకులకు సూచించారు. సన్నరకం ధాన్యం గింజ 6 ఎంఎం కంటే తక్కువ పొడవు 2 ఎంఎం వెడల్పు, 2:5 నిష్పత్తితో ధాన్యం గింజ ఉండాలని తెలిపారు. తేమ శాతం 17 ఉన్నటువంటి ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తరలించాలని తెలిపారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన సన్నరకం వరి ధాన్యం బస్తా ప్యాకింగ్ చేస్తున్నప్పుడు ఎర్ర కలర్ సుతిలి వాడాలని, దొడ్డు రకం (కామన్ గ్రేడ్) ధాన్యం బస్తా ప్యాకింగ్‌కు ఆకుపచ్చ సుతిలితో కుట్టు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి, డీపీఎం వేణు, అగ్రికల్చర్ ఏఈఓ మార్క్‌గ్లాడ్సన్, ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్, సీసీ దీపక్, వీఓఏలు, లీడర్లు పాల్గొన్నారు..

అలరించిన ఫ్రెషర్స్ డే



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం అందుగులపేటలోని సాయిమిత్ర గార్డెన్స్‌లో నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించిన ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని అది నెరవర్చుకునే దిశగా ముందుకు సాగాలని అందుకు సంబంధించి కళాశాల యాజమాన్యం ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తుందన్నారు. ముఖ్య అతిథిగా ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్‌రావు హాజరై యువత డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేసే విధంగా ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్‌ని విడుదల చేసి బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఉండే విధంగా చూడాలన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సంస్కృతిక కార్యక్రమాలు పలువురుని ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ ఉదరి చంద్రమోహన్, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాపోలు విష్ణువర్ధన్ రావు, జిల్లా అధ్యక్షుడు సిద్దయ్య పాల్గొన్నారు.

పట్టభద్రుల పక్షాన పోరాడుతా

- ప్రతి ప్రయివేట్ పాఠశాల సిబ్బందికి బీమా కల్పిస్తా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు

నవతెలంగాణ-మంచిర్యాల



నిరుద్యోగుల, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు తెలిసిన వాడిగా వారి సమస్యలపై పోరాడుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శేఖర్‌రావు అన్నారు. సోమవారం మంచిర్యాల, మందమర్రి పాఠశాలలను సందర్శించిన ఆయన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్, వివేకావర్ధిని డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. మదర్ తెరిసా, కార్మల్, సేంట్ అల్ఫోన్స్, శ్రీ ఉషోదయ స్కూల్‌లను సందర్శించారు. ప్రయివేట్ పాఠశాలలో పని చేసే ప్రతి ఉపాధ్యాయులు ఓటర్ నమోదు ఆవశ్యకతను తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణు వర్ధన్ రావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సిద్దయ్య, రామ్ వేణు జిల్లా కార్యవర్గ సభ్యులు, మందమర్రి మండల అధ్యక్షుడు ఉప్పలయ్య, గౌరవ సభ్యులు పోలు శ్రీనివాస్, వెంకటేశ్వర రావు, మాధవన్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని అచలాపూర్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్లకు రూ.2320 మద్దతు ధర ప్రకటించినట్టు పేర్కొన్నారు. సన్న రకాలకు రూ.500 బోనసు ప్రభుత్వం చెల్లించనున్నట్లు వివరించారు. నాణ్యమైన ధాన్యానికి ప్రభుత్వం కోత విధించకుండా పూర్తి మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సెక్రెటరీ శ్రీనివాస్ సిబ్బంది వెంకటేష్, అనిల్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలి

నవతెలంగాణ-జన్నారం

పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించేందుకు ప్రతీ ఒకరు ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యాదికారి డాక్టర్ ఉమశ్రీ సూచించారు. సోమవారం మండలంలోని చింతగూడ సబ్ సెంటర్ పరిధిలో ఉన్న దొంగపల్లి, అల్లీ నగర్ గ్రామాలలో వారు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, బీమ్‌రావు ప్రభుత్వ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
మంగళవారం | నవంబర్ 12, 2024 | www.navatelangana.com

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
నవతెలంగాణ-సిరికొండ



ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్న గోదుమల్లె, నేరడిగొండ-జీ, కే, జెండాగూడ గ్రామాల్లో పర్యటించారు. జెండాగూడ గ్రామం నుండి ఎల్లమ్మ గూడ గ్రామం వరకు రూ.2 కోట్ల 50 లక్షల నిధులతో బీటి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయంలో గిరిజన మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేసి బీటీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో కావాల్సి సౌకర్యాలను ఏర్పాటు చేసే విధంగా చూస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు పెంటన్న, ఇక్బాల్, చందు, సూర్యకాంత్ పాల్గొన్నారు.

మొబైల్ సైన్స్ ల్యాబ్ సందర్శన
నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలోని మొబైల్ సైన్స్ ల్యాబ్‌ను సోమవారం మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఉపాధ్యాయులు ప్రయోగాల ద్వారా బోధన చేయడం ద్వారా విద్యార్థులలో శాస్త్రీయ వైఖరిని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, రిసోర్స్ పర్సన్‌లు శాంతికుమార్, దుర్గా ప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య
నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య ఘటన చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గూడెం గ్రామానికి బుజ్జాడి తిరుపతి (22) సోమవారం రాత్రి సమయంలో మద్యం తాగాడు. ఇంటికి వచ్చిన తిరుపతిని తల్లిదండ్రులు మందలించారు. కోపంతో తిరుపతి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహారాష్ట్రలోని అహిరి ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు తెలిపారు.

పత్తికి రూ.12వేల గిట్టుబాటు ధర కల్పించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతులకు పెరుగుతున్న పెట్టుబడి నేపథ్యంలో ప్రస్తుతం రైతుల పత్తి పంటకు రూ. 12000 గిట్టుబాటు ధర కల్పించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజావాణిలో భాగంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పత్తి అమ్మకాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వాతావరణంలో మార్పు ఉన్నందున తేమ పరీక్ష లేకుండా సీసీఐతో పాటు, ప్రయివేటు జిన్నింగ్ మిల్లుల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. గత సంవత్సరం పత్తికి రూ.పదివేలకు పైగా ఉండడంతో అనేకమంది రైతులు పత్తి పంటపై ఆధారపడి దానిని సాగు చేశారన్నారు. ప్రభుత్వం దీనిని గమనించి రైతులకు మద్దతు ధర రూ.12000 చెల్లించి వారికి అండగా నిలవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పురుషోత్తం బాలేష్, బొట్టుపల్లి ప్రశాంత్, బొట్టుపెల్లి సాయికృష్ణ, రైతులు గోపాల్, సతీష్, అరుణ్, మహేష్, శ్రీపాల్, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతులకు అన్ని రకాల రుణాలివ్వడమే లక్ష్యం
నవతెలంగాణ-తాంసి

రైతులకు సహకార సంఘం సొసైటీలో అన్ని రకాల రుణాలు అందించడమే లక్ష్యంగా సొసైటీ పనిచేస్తుందని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజరెడ్డి అన్నారు. సోమవారం సొసైటీ సర్వసభ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి సంబంధించిన ఎజెండాను సీఈఓ కేశవ్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ జిల్లా సొసైటీ బలోపేతానికి రూ.300 కోట్ల రుణాలు రైతులకు ఇవ్వడానికి ప్రణాళిక చేశామని, ప్రతి సొసైటీకి రూ.10 కోట్ల చొప్పున రుణ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. రైతుల అవసర నిమిత్తం మూడు గోదాముల స్థలాల సేకరణ చేయడం జరిగిందన్నారు. రైతులు ప్రయివేటు వ్యక్తుల దగ్గర అధిక వడ్డీలకు తీసుకొని మోసపోకుండా సహకార బ్యాంకుల్లోని తక్కువ వడ్డీకి రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రతి రైతుకు ఇంటి, ట్రాక్టర్, బంగారంపై రుణాలు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ నెలలో రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని కోరుతూ వ్యవసాయ శాఖ మంత్రితో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ధనుంజయ్, డైరెక్టర్లు అశోక్ రెడ్డి, భూమారెడ్డి, బుజ్జన్న, చంద్రన్న, డైరెక్టర్లు ఉన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సారంగాపూర్

రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హదీ అన్నారు. సోమవారం మండలంలోని ప్యారమూర్, తాండ్ర(జి), కంకెట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తెచ్చి విక్రయించాలన్నారు. మొదటి రకాం ధాన్యం క్వింటాళుకు రూ.2320, రెండవ రకానికి రూ.2300 మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ శంకర్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం మాధురి, నాయకులు రవీందర్ రెడ్డి ,సాయన్న, రైతులు పాల్గొన్నారు.

వంగ మహేందర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపర్చాలి
నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయు టీఎస్ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న వంగ మహేందర్ రెడ్డి అభ్యర్థత్వాన్ని బలపరచాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఎమ్మెల్సీ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో మెరుగైన వేతన సవరణ, ఉపాధ్యాయ ఉద్యోగుల సీపీఎస్ రద్దు, క్రమం తప్పకుండా పదోన్నతులు ఇప్పించేందుకు, పెండింగ్ బిల్లులు అన్నిటిని సకాలంలో మంజూరు చేసే విధంగా, కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎస్ మంజూరు చేసే విధంగా, ఐటీడీఏలో పనిచేస్తున్న సీఆర్టీలకు రెగ్యులర్ చేసే విధంగా, పీఆర్టీయూ కృషి చేస్తుందని తెలిపారు. తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి చునార్కర్ భరత్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి రవి, నాయకులు ఆడే ప్రకాష్, మడవి హనుమంతు, దొంతు రాజు వేణుగోపాల్, పర్సా చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, డెబ్బటీ సత్యనారాయణ, నానాజీ, ప్రధానోపాధ్యాయులు గడ్డం సునీత, మహేశ్వరరావు, అబ్దుల్ లతీఫ్, వైరాగడే ప్రమోద్ కుమార్, వినయ్ కుమార్, కవిత, మండల విద్యాధికారి సుభాష్ రాథోడ్, వాసాల ప్రభాకర్, లెవన్ కుమార్ శ్రీశైలం, జాడి రాహుల్ పాల్గొన్నారు.

పొరపాట్లకు తావు లేకుండా సర్వే నిర్వహించాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య



కాగజ్‌నగర్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత, కలెక్టర్, అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు ఉండవద్దని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య సూచించారు. సోమవారం కాగజ్‌నగర్ మండలం వంజిరితో పాటు కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీ, టీచర్స్ కాలనీలలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రేతో కలిసి పర్యటించి సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇప్పటికే ఇళ్ల జాబితా ప్రక్రియ పూర్తైనందున సర్వే పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. తమకు కేటాయించిన బ్లాక్‌లలో ఎన్యుమరేటర్లు పూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత నమూనాలో నమోదు చేయాలన్నారు. సర్వే ముందు రోజే ఏ ప్రాంతంలో సర్వేకు రానున్నామనే వివరాలను సంబంధిత కుటుంబ సభ్యులకు అందించాలన్నారు. వరి కోతలు, పత్తి ఏరివేత పనులు కొనసాగుతున్నందున రైతులు అందుబాటులో ఉండే అవకాశం ఉండదని, వారికి ఒక రోజు ముందే సమచారం ఇచ్చి ఒక కుటుంబసభ్యుడిని అందుబాటులో ఉంచే విధంగా వారికి సూచనలు చేయాలన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

అనంతరం కాగజ్‌నగర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో 34 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వారికి వివరించారు. రైతులు ధాన్యం తీసుకువచ్చే సమయంలో తేమ శాతం తక్కువగా ఉండేలా చూసుకొని, ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కృష్ణ ఆదిత్య రైతులకు సూచించారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రం, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడతో పాటు ఇతర మౌళిక సదుపాయాలు కల్పించాలని కృష్ణ ఆదిత్య అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, అధికారులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్ రూరల్ : మండలంలోని యాపల్‌గూడ, వాన్‌వాట్‌లో సోమవారం ఎన్యుమరెటర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న తీరును, నిర్ణీత ఫారాలలో ఆయా కోడ్‌ల వారీగా వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కులగణన నమోదు తీరును దగ్గరుండి పరిశీలించి, ఫారంలో ఉన్న ప్రశ్నలన్నిటిని అడిగి పూర్తి వివరాలు ఫారంలో పూరించాలని, స్టార్ గుర్తు ఉన్న వాటిని తప్పకుండా తప్పులు లేకుండా, కొట్టి వేతలు లేకుండా పూరించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నాగభూషణం, ఎంపీడీఓ నాగేశ్వర్ రావు, పంచాయితీ సెక్రటరీ, ఏఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నార్నూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామజిక, ఆర్థిక, విద్య, ఉపాధి మరియు రాజకీయ, కుల సర్వేను ప్రజలు అందరూ సహకరించాలని సూపర్‌వైజర్లు ఏపీఓ జాదవ్ సురేష్, ఏపీఎం మైస రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని బేతల్ సోనాపూర్, మండల కేంద్రంలోని దుర్గానగర్, సేవాలాల్ నగర్, అంబేద్కర్ నగర్, జీన్‌గూడ, ముస్లింగూడ, అన్నబావుసాటే నగర్ కాలనీలలో ఎన్యుమరెటర్లు సర్వే చేస్తున తీరును పరిశీలించారు. ఆయన వెంట సర్వేలో సీసీ కిషన్, పంచాయతీ కార్యదర్శి మోతిరాం, శ్రీనివాస్ ఉపాద్యాయులున్నారు.



ఆదిలాబాద్ రూరల్ : సర్వేలో ఫారం పూరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

తలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర ఇంటింటి సర్వేను ఏలాంటి తప్పిదాలు లేకుండా నిర్వహించాలని మండల తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ సుధీర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, సూపర్‌వైజర్ దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.



సర్వేలో వివరాలు నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్లు

రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం

- కలెక్టరేట్ ఎదుట అఖిలపక్షం రైతు సంఘం ధర్నా
- తేమ మినహాయింపుతో కొనుగోలు చేయాలి
- సంఘం కన్వీనర్ బండి దత్తాత్రి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పత్తి రైతులకు కనీస మద్దతు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని అఖిల పక్షం రైతు సంఘం కన్వీనర్ బండి దత్తాత్రి అన్నారు. తేమ మినహాయింపుతో పత్తిని కొనుగోళు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట టెంట్ వేసుకొని ధర్నా నిర్వహించారు. ఆయా పార్టీల రైతు సంఘాల నాయకులు పాల్గొని పత్తికి మద్దతు ధరతో పాటు తేమ శాతం సడలించాలని కోరారు. ఈ సందర్భంగా అఖిలపక్షం రైతు సంఘం కన్వీనర్ బండి దత్తాత్రి మాట్లాడుతూ.. జిల్లాలో గత నెల 25న పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, కానీ తేమ శాతం కారణంగా రైతులు మద్దతు ధర పొందలేకపోతున్నారని అన్నారు. తేమను సడలించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను వెంటనే ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా స్వామినాథన్ కమిషన్ ను బెఖాతారు చేస్తుందన్నారు. ప్రభుత్వ వైఖరి కారణంగా పత్తి రైతులు వాటిని అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుజరాత్ లో ఓ విధంగా తెలంగాణలో ఓ విధంగా కొనుగోల్లు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం రైతులను గుజరాత్ కు తీసుకెళ్లి అక్కడి ధరల గురించి తెలియజేయాలన్నారు. రైతుల పక్షాన సంఘం తరుపున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. మద్దత్తు ధర ఇప్పించడంలో అధికార పార్టీ, ఎమ్మెల్యే లు అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని రైతులను పూర్తిగా దగా చేస్తూ మద్దతు ధర లేకుండా పత్తి కనుగొళ్ళు చేపడుతున్నారని దుయ్యాబట్టారు. తక్షణమే ఎలాంటి తేమ షరతులు లేకుండా మద్దత్తు ధరతో పత్తిని కొనాలని దానికోసం కేంద్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం ఎమ్మెల్యే, ఎంపీ లు కషి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన ప్రకారం ఎకరానికి 15 వేల చొప్పున రెండు విడతల రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు లోకారి పోశెట్టి, నారాయణ, పరమేశ్వర్, గంద్రత్ రమేష్, జగదీష్, చిల్క దేవిదాస్, లక్ష్మణ్, ప్రహ్లద్, శంకర్, గోవర్ధన్, రమేష్, జగన్ సింగ్, నంది రామయ్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఎస్పీ గౌస్ ఆలం సోమావారం తనిఖీ చేశారు. ముందుగా ఎస్పీ గౌస్ ఆలంకు డీఎస్పీ జీవన్ రెడ్డితో పాటు సీఐ ఫణిదర్‌లు పుష్ప గుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్ క్వార్టర్‌ల దుస్థితిని ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయని సిబ్బంది నివాసించే విధంగా లేవని ఎస్పీకి తెలియజేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెన్‌బ్యారక్, టెక్నికల్‌రూం, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకొని ఎస్సై శివరాంకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలు అందించాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. మాదకద్రవ్యాలకు యువత అలవాటు పడకుండా ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునే వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు.

న్యాయం చేయాలంటూ డీఎస్సీ అభ్యర్థి వేడుకలు

ఆసిఫాబాద్ : తనకు న్యాయం చేయాలంటూ డీఎస్సీ 2024లో 1:3లో ఎంపికైన బోర్లకుంట రాయమల్లు వేడుకున్నారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత డీఎస్సీలో ప్రత్యేక విద్యా విభాగంలో 1:3లో తాను ఎంపిక అయ్యానని, చివరి ఎంపికకు, తనకు అర్హత ఉన్న పక్కనపెట్టి వేరే వ్యక్తికి ఇచ్చారని ఆరోపించారు. ఇదే విషయం తాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా ఫలితాలు నిలిపివేశారని, వెంటనే ఆ ఉద్యోగం అన్ని అర్హతలు ఉన్న తనకు ఇవ్వాలని కోరారు.

ఎన్యుమరేటర్లకు పనిభారం తగ్గించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కులగణన చేపట్టే ఎన్యుమరేటర్లకు పనిభారం తగ్గించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపడుతున్న కులగణన సందర్భంగా ఎన్యుమరేటర్లుగా నియమింపబడ్డ ఉద్యోగ, ఉపాధ్యాయులపై పెనుభారం పడుతోందని అన్నారు. ప్రతీ ఎన్యుమరేటర్‌కు 100 లోపు కుటుంబాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 నుండి 200 వరకు కుటుంబాలు కేటాయించారని, ఇది వారి తలకు మించిన భారమని అన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ పునరాలోచన చేయాలని కోరారు. అంతేకాకుండా గణనకు సంబంధించిన మెటీరియల్‌ను మండల కేంద్రాలలో కాకుండా పంచాయతీ కేంద్రంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు ఇచ్చే రెమ్యునరేషన్‌ను కూడా సర్వే చేసిన కుటుంబాల ఆధారంగా ప్రకటించాలని, అది కూడా సర్వే పూర్తయ్యిన వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ కాగజ్‌నగర్ మండల అధ్యక్షులు మహిపాల్, జిల్లా కమిటీ సభ్యులు బాజీఖాన్, శిరీష, సురేష్ ఉపాధ్యాయులు, ఇతరులు పాల్గొన్నారు.



నేటి కార్తీక దినోత్సవం విజయవంతం చేయాలి
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే కార్తీక దీపోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని మేఘరాజ్ శర్మ కోరారు. సోమవారం డైట్ మైదానంలో కార్తీక దీపోత్సవ ఏర్పాట్లను సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రితో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. మహిళలకు పూజ సామాగ్రిని సమితి తరపున అందిస్తామని, మహిళలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమైతుందన్నారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

గురుకులంలో మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకలు
నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం చింతగూడ బలగల గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాల బాలురు-2లో సోమవారం మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యశాఖ అడిషనల్ డైరెక్టర్ గమానియల్ హాజరు కాగా ప్రిన్సిపాల్ షగుఫ్తా, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

• నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరుపై ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, సూపర్‌వైజర్లతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో భాగంగా ఇండ్ల జాబితా ప్రక్రియ పూర్తయినందున కుటుంబ సభ్యుల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు నిర్మిత నమూనాలు స్పష్టంగా నమోదు చేయాలని, సర్వే ముందు రోజు ఏ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్నారో సంబంధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని అన్నారు. ప్రత్యేక అధికారులు, ఆర్డీఓలు క్షేత్ర స్థాయిలో సర్వేను పరిశీలించాలని సూచించారు. సర్వేలో భాగంగా ప్రజల నుంచి సామాజిక, ఆర్థిక, విద్య ఉద్యోగ, రాజకీయ, కుల తదితర నిర్ధేశిత వివరాలను సేకరించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సర్వేను పూర్తిచేసిన ఇండ్లకు సంబంధించి వివరాలను మండలాల వారిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 2,31,286 కుటుంబాలకు గాను 33,590 కుటుంబాల సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు అందజేయాలన్నారు. ఎన్యూమరేటర్లు సమయానికి తమకు కేటాయించిన ఎన్యూమరేషన్ బ్లాకులోకి చేరుకొని సర్వే నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఎన్యూమరేటర్లు నిర్వహించిన సర్వేలోని 20 శాతం వివరాలను ర్యాండంగా పరిశీలించాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో సీపీఓ జీవరత్నం, నిర్మల్, భైంసా ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డిలు, జెడ్పీ సీఈఓ గోవింద్, డీఆర్డీఓ విజయలక్ష్మి, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాథోడ్ భీంరావుకి ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

సాధారణ నిరుపేద కుటుంబంలో పెరిగి నేడు ట్రైబల్ వెల్ఫేర్ ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎనలేని సేవలు అందించిన రాథోడ్ భీమ్‌రావు నాయక్ ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సోమవారం ఉట్నూర్‌లోని వారి నివాసంలో బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ శాలువాలతో సన్మానించి, ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్న భీమ్‌రావు నాయక్ జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంద్రా జైవంత్‌రావు, మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, సలీమోద్దీన్, కాటం రమేష్, సింగరే భారత్, సాడిగే రాజ్ కుమార్, కుర్సెంగా భూమన్న, సత్తన్న, సిడం సొనేరావు, రషీద్, ముజీబ్, దినేష్, అన్వేష్, సాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల పార్టీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పేదల పార్టీ అని పేద బడగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పని చేస్తుందని, కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రజాసేవాభవన్‌లో జరిగిన చేరికల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సుధాగోని సుధాకర్ గౌడ్, ఆత్రం గంగారాం పటేల్, సిడాం రాము పటేల్, టేకం సంతోష్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలం అంకాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని దొండరిగూడ, రాముగూడ, గుండంలొద్ది, పాకిడిగూడ గ్రామాల నుంచి, అలాగే డాక్టర్ మారుతి ఆధ్వర్యంలో చాంద(టి) గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కంది శ్రీనివాస్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, ఎంఏ షకీల్, ఐఎన్టియూసీ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్, రూరల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న, కౌన్సిలర్లు బండారి సతీష్, యెల్మల్‌వార్ రామ్ కుమార్, నాయకులు ఎంఏ కయ్యుమ్, బూర్ల శంకరయ్య, తిప్పిరెడ్డి విఠల్‌రెడ్డి, దినేష్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన డీఆర్డీఓ

నవతెలంగాణ-కడెం

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని డీఆర్డిఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని మద్దిపడగ, లక్ష్మీసాగర్, కొత్త మద్దిపడగ, గ్రామపంచాయతీలలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను సోమవారం డీఆర్డీఓ పరిశీలించి, మాట్లాడారు. సమగ్ర సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలు మాట్లాడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లావ్యాప్తంగా సోయా కొనుగోలు కొనసాగుతున్నా, రైతుల ఖాతాలో మాత్రం డబ్బులు జమ కావడం లేదన్న బీఆర్ఎస్ నాయకులు, వాస్తవం తెలుసుకొని మాట్లాడాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడిచిన మూడు రోజుల కింద కొందరు బీఆర్ఎస్ నాయకులు సోయా రైతులకు అసలు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న డబ్బులు ఎందుకు జమ చేయడం లేదని, విమర్శలు చేయడం మానుకోవాలని తెలిపారు. ఇదే విషయంపై సంబంధిత మార్క్‌ఫెడ్ జీఎంను సంప్రదించి వివరాలు తెలుసుకున్నామని, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 6,551 మంది రైతుల నుంచి 1,12,522 క్వింటాళ్లు కొనుగోలు చేసి, సుమారు 1500 మంది రైతులకు రూ.11 కోట్ల 82 లక్షలు చెల్లించడం జరిగిందని తెలియజేసినట్లు పేర్కొన్నారు.

నిర్మల్ చిన్నారికి అయోధ్యలో పురస్కారం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



నిర్మల్ చిన్నారికి అయోధ్యలో ఈనెల 9, 10వ తేదీల్లో అయోధ్యలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన రామ్ లల్లా సంగీత నృత్యార్చన కార్యక్రమంలో చిన్నారి వైష్ణవి ఉత్తమ ప్రతిభ కనబర్చిందని శిక్షకులు నవ్య వినయ్ కుమార్ తెలిపారు. దీంతో నిర్వాహకులు చిన్నారికి ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారని పేర్కొన్నారు. ఈ పురస్కారం లభించడంతో వైష్ణవిని పలువురు సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

• మున్సిపల్ ఎదుట కార్మికుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ పరిధిలో పని చేసే కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశార. సోమవారం మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ కరోనా కాలంలో మున్సిపల్ కార్మికులను సేవలను కొనియాడిన గత బీఆర్ఎస్ వారి సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్మికుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఎలాంటి చర్య లేవన్నారు. మున్సిపల్లో పని చేసే ప్రతి కార్మికుడిని ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించడంతో పాటు ప్రతి నెల 5లోపు వేతనాలు, పీఆర్సీ, ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు ఉన్నారు

లక్ష్మిరాజయ్య మృతికి సంతాపం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలుగు సాహితీ సదస్సు అధ్యక్షులు, సామల సదాశివ అవార్డు గ్రహీత శ్రీరామోజు లక్ష్మిరాజయ్య మృతి సాహితీరంగానికి తీరనిలోటని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, ఎస్ఆర్ శంకరన్ ఐఎఎస్ అకాడమి అడ్మినిస్ట్రేటివ్ అధికారి కోట సతీష్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన కాగజ్‌నగర్‌లోని రామోజు లక్ష్మిరాజయ్య నివాసానికి వెళ్లి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోట సతీష్‌కుమార్ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లక్ష్మిరాజయ్య వద్ద తాను విద్య నేర్చుకున్నానని, త్రికరణ శుద్ధితో తెలుగు సాహిత్యరంగాభివృద్ధికి లక్ష్మిరాజయ్య పాటుపడ్డారని కొనియాడారు.

ఉర్దూ రిపోర్టర్లకు ఆత్మీయ సత్కారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉర్దూ భాషాభివృద్ధికి భారత రత్న, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, మైనార్టీ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మెన్ జహీర్‌రంజానీ అన్నారు. కంది శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయం, ప్రజా సేవ భవన్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు ఉర్దూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందచేశారు. ఉర్దూ భాషకు అబుల్ కలామ్ ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలకనుగుణంగా నడుచుకోవాలని కోరారు. తమను గుర్తించి సత్కరించినందుకు ఉర్దూ పాత్రికేయులు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి సతీష్, సంద నర్సింగ్, జాఫర్ అహ్మద్, నాయకులు ఎంఏ షకీల్, ఖిజర్ పాషా, ఎంఏ ఖయ్యుమ్, మొహమ్మద్ రఫీక్, షేక్ ఖలీం, ఇర్ఫాన్ ఖాన్, తకిమొద్దీన్, సయ్యద్ షాహిద్ అలీ, అతిక్ ఉర్ రహమాన్, సయ్యద్ షౌకత్ అలీ, అజీజ్ ఖాన్, కర్మ అఖిమ్, అంజద్ ఖాన్, అయాస్ ఖాన్, భరత్, శ్రవణ్ నాయక్, బండారి చిన్నయ్య, అస్బాత్ ఖాన్, అజీజ్ పాల్గొన్నారు.

ఘనంగా విఠల రుక్మాబాయి ఆలయ వార్షికోత్సవం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని అర్లి(కే) గ్రామంలో విఠల రుక్మాబాయి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గ్రామంలో పల్లకి ఊరేగింపు అనంతరం కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్, అసోసియేట్ అధ్యక్షులు పాశం రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు ముచ్చ రఘు, జిల్లా కార్యవర్గ సభ్యులు మలపతి సుభాష్, అర్లి(కె) మాజీ సర్పంచ్ నారు కిష్టన్న, మాజీ ఎంపీటీసీ నారు నాగయ్య, రమేష్ రెడ్డి, గ్రామస్తులు బోండ్ల వెంకటస్వామి, నిమ్మల గజానన్, మైస సురేష్, సంధ్య వేణి, సత్యనారాయణ రెడ్డి, రమేష్, బుచ్చన్న, భూమారెడ్డి, సురేందర్ రెడ్డి, వినోద్, అభిలాష్ మహిళలు పాల్గొన్నారు.

గ్రహణమొర్రి వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ డైస్ ఆధ్వర్యంలో ఏవీఆర్ డెంటోఫెషియల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గ్రహణమొర్రి వైద్య శిబిరానికి స్పందన లభించింది. సోమవారం ఈ శిబిరాన్ని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సందర్శించారు. పరీక్ష విధానం, రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన విజయ్ కుమార్ చిన్నారులను పరీక్షించి అవసరమైన వారికి సర్జరీ కోసం రేఫర్ చేశారు. గ్రహణమొర్రితో బాధపడుతున్న చిన్నారుల కోసం ప్రత్యేకంగా నిర్వహించే శిబిరాలను వినియోగించుకోవాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డైస్ కేంద్రంలో ఉచితంగా వివిధ వ్యాధులకు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఉచితంగా నిర్వహించే ఇలాంటి శిబిరాలను సద్వియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి ఖర్చులు లేకుండా అవసరమైన సర్జరీలు చేస్తారన్నారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్, డైస్ ఇన్‌చార్జి మెనేజర్ రాధిక, ఫీజియోథెరపిస్టు నాగర్జున, సైకియార్టిస్ డాక్టర్ అధిత్య ఉన్నారు.